నమస్తే తెలంగాణ
మహబూబాబాద్
5 | శుక్రవారం 19 జూలై 2024 | MAHABUBABAD

మహబూబాబాద్‌లోని ఎర్రగడ్డ తండా వద్ద ఉన్న రైతు వేదికలో రైతు రుణమాఫీ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే డాక్టర్ మురళీనాయక్, ఎమ్మెల్సీ తక్కళ్లపల్లి రవీందర్‌రావు, కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్

అర్హులందరికీ రుణమాఫీ

మాఫీతో సన్న, చిన్నకారు రైతులకు ఆర్థిక భరోసా

- మాఫీతో సన్న, చిన్నకారు రైతులకు ఆర్థిక భరోసా
- నిధుల విడుదల కార్యక్రమంలో కలెక్టర్లు, ఎమ్మెల్యేలు
- రైతు వేదికల్లో సీఎం వీడియో కాన్ఫరెన్స్ వీక్షణ
- రేవంత్‌రెడ్డితో మాట్లాడిన పలువురు రైతులు

నమస్తే నెట్‌వర్క్ : ఉమ్మడి వరంగల్ జిల్లాలో అర్హులైన రైతులందరికీ రుణమాఫీ వర్తించేలా కృషి చేస్తామని ఆయా జిల్లాల కలెక్టర్లు, ఎమ్మెల్యేలు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు రూ. లక్షలోపు రుణాలను గురువారం మాఫీ చేసిన సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి హైదరాబాద్‌లో నిధులు విడుదల చేసిన కార్యక్రమాన్ని రైతులు వీక్షించేందుకు రైతు వేదికల్లో వీడియో కాన్ఫరెన్స్‌కు ఏర్పాట్లు చేయగా, ఆయా జిల్లాల కలెక్టర్లు, ఎమ్మెల్యేలు, అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మొదటి విడుతలో రూ. లక్షలోపు రుణాల మాఫీ జరిగిందని, మరో రెండు దశల్లో రూ. రెండు లక్షలలోపు వారికి మాఫీ జరుగుతుందని తెలిపారు. దీనివల్ల సన్న, చిన్నకారు రైతులకు ఆర్థిక భరోసా కలుగుతుందన్నారు. ఈ మేరకు పలువురు రైతులు సీఎం రేవంత్‌రెడ్డితో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. ఇందులో భాగంగా హనుమకొండ జిల్లా మడికొండలోని రైతు వేదికలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కలెక్టర్ పీ ప్రావీణ్య, రాష్ట్ర ఆయిల్ ఫెడ్ కార్పొరేషన్ చైర్మన్ జంగా రాఘవరెడ్డి పాల్గొన్నారు. పరకాల పట్టణంలోని రైతు వేదికలో జరిగిన కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి పాల్గొన్నారు. వరంగల్ జిల్లా వర్ధన్నపేటలో కలెక్టర్ సత్య శారద, జేడీఏ ఉషాదయాళ్, ఏడీఏ సురేశ్‌కుమార్, స్థానిక ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు, మున్సిపల్ చైర్‌పర్సన్ ఆంగోతు అరుణ, వైస్ చైర్మన్ ఎలేందర్‌రెడ్డి పాల్గొన్నారు. నర్సంపేటలో అడిషనల్ కలెక్టర్ సంధ్యారాణి, చెన్నారావుపేటలో ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి పాల్గొన్నారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా గణపురం మండల కేంద్రంలోని రైతు వేదికలో కలెక్టర్ రాహుల్‌శర్మ, ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు, ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ లిమిటెడ్ చైర్మన్ అయిత ప్రకాష్ రెడ్డి, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి విజయభాస్కర్ పాల్గొన్నారు. జనగామ జిల్లా లింగాలఘనపురంలో స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి, వరంగల్ ఎంపీ కడియం కావ్య పాల్గొన్నారు. అలాగే జనగామ మండలం గానుగుపహాడ్ రైతు వేదికలో నిర్వహించిన కార్యక్రమంలో కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా, భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, పలువురు అధికారులు పాల్గొన్నారు. మహబూబాబాద్ పట్టణ శివారు ఏటిగడ్డతండా రైతు వేదికలో కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్, స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ మురళీ నాయక్, ఎమ్మెల్సీ తక్కళ్లపల్లి రవీందర్ రావు, మున్సిపల్ చైర్మన్ రామ్మోహన్ రెడ్డి పాల్గొన్నారు. అలాగే తొర్రూరు మండలం మాటేడులో పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినీరెడ్డి, రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య తదితరులు పాల్గొన్నారు. ములుగు జిల్లా కేంద్రంలోని రైతు వేదికలో కలెక్టర్ టీఎస్ దివాకరతో పాటు డీఏవో విజయ్‌చంద్ర తదితరులు పాల్గొన్నారు.

భీలా వరంగల్ : బొల్లికుంట రైతు వేదికలో వీసీలో సీఎం రేవంత్‌రెడ్డితో మాట్లాడుతున్న రైతు ఎల్లయ్య



నర్మెట మండలం హన్మంతాపూర్ రైతు వేదికలో వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న రైతులు, అధికారులు

మాఫీ మాయ..!

రైతుల్లో అయోమయం.. గందరగోళం

- లబ్ధిదారుల జాబితాపై అస్పష్టత
- సహకార రుణాలదీ అదే తీరు
- గ్రామాల వారీగా జాబితా కరువు
- సమాచారం లేదంటూ దాటవేత
- బ్యాంకు బ్రాంచీల్లోనూ అదే పరిస్థితి

కాంగ్రెస్ ప్రభుత్వం అమలుచేస్తున్న పంట రుణాల మాఫీ పథకంపై అంతటా అయోమయం నెలకొన్నది. ప్రభుత్వం గుర్తించిన లబ్ధిదారుల జాబితాలోని పేర్ల వివరాలు ఎవరికీ తెలియకపోవడం గందరగోళానికి గురిచేస్తున్నది. గ్రామాల వారీగా లబ్ధిదారుల జాబితా రూపొందించారని ప్రభుత్వం పేర్కొన్నా ఎక్కడా అందుబాటులో లేదు. రుణమాఫీ ప్రక్రియ ప్రారంభమైనట్లు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించారు. అనంతరం జిల్లాలో, నియోజకవర్గ కేంద్రాల్లో, మండలాల్లో, గ్రామాల్లోని రైతు వేదికల్లో మంత్రులు, ఎమ్మెల్యేలు, అధికార పార్టీ నాయకులు కలిసి కార్యక్రమాలు నిర్వహించారు. రుణమాఫీ లబ్ధిదారుల వివరాలు ఎక్కడా రైతులకు అందుబాటులోకి రాలేదు. గ్రామ పంచాయతీల్లోనూ ఎక్కడా వీటిని ప్రదర్శించలేదు. గ్రామాల వారీగా కాకుండా బ్యాంకుల వారీగా లబ్ధిదారుల జాబితా ఉంటుందని పలుచోట్ల అధికారులు ప్రకటించారు. గ్రామాల్లోని బ్యాంకు బ్రాంచీల్లోనూ ఇది ఎక్కడా అందుబాటులో లేదు. జిల్లా కేంద్రాల్లోని ప్రధాన బ్యాంకు శాఖల నుంచి సేకరించిన సమాచారంతో స్టేట్ లెవల్ బ్యాంకర్స్ కమిటీ(ఎస్ఎల్‌బీసీ) రుణమాఫీ లబ్ధిదారుల జాబితాను రూపొందించిందని, ఈ వివరాలు తమ వద్ద అందుబాటులో ఉండవని గ్రామాల్లోని బ్యాంకుల అధికారులు చెప్పారు. గ్రామాల వారీగా లబ్ధిదారుల జాబితాలు లేవని పేర్కొన్నారు. ఒక్కో గ్రామంలోని రైతులు వేర్వేరు బ్యాంకుల్లోని, వేర్వేరు బ్రాంచీల్లో పంట రుణాలు పొందారని, గ్రామాల వారీగా లబ్ధిదారుల సమగ్ర జాబితాలు లేవని చెప్పారు. అయితే ప్రభుత్వం రుణాలను మాఫీ చేసినట్లు తమకు ధ్రువీకరణ రావాలని రైతులు చెబుతున్నారు. పంట రుణాలు తీసుకున్న తమ బ్యాంకు అకౌంట్‌లో ప్రభుత్వం డబ్బులు జమ చేసినట్లు సెల్‌ఫోన్లకు మెసేజ్ వస్తుందని, అప్పుడే తాము మాఫీ అయినట్లు భావిస్తామని రైతులు చెప్పారు. రెండు రోజుల తర్వాత బ్యాంకుకు వెళ్లి పంట రుణం మాఫీపై స్పష్టత తీసుకుంటున్నామని అన్నారు. రూ.2 లక్షల వరకు పంట రుణాలను మాఫీ చేస్తామని కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించింది. ఏడు నెలల తర్వాత గురువారం నుంచి ఈ ప్రక్రియను చేపట్టింది. మొదటి దశలో లక్ష రూపాయల వరకు పంట రుణాలను మాఫీ చేస్తున్నట్లు తెలిపింది.

సహకార లోన్లు ఎలా?

ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు(పీఏసీఎస్), గ్రామీణ వ్యవసాయ బ్యాంకుల్లో తీసుకున్న రుణాల మాఫీపై రైతుల్లో ఆందోళన ఉన్నది. ఈ రెండు బ్యాంకుల్లో రుణాలు పొందిన వారిలో రుణమాఫీకి అర్హుల జాబితాను తయారు చేయలేదు. గురువారం సాయంత్రం ఈ బ్యాంకుల్లో రుణాలు మాఫీ అయ్యే లబ్ధిదారుల జాబితాలను ప్రకటించారు. మొదట ఈ బ్యాంకుల్లోని రుణాలు మాఫీ అవుతాయో, లేదో అనే సందేహాలు వ్యక్తమయ్యాయి.

రైతుల్లేని సంబురాలు

రైతుల వేదికల వద్ద రుణమాఫీపై సంబురాలు నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం పిలుపునిచ్చింది. ఆయాచోట్ల ఎమ్మెల్యేలు, స్థానిక కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. ఈ సంబురాల్లో కాంగ్రెస్ కార్యకర్తలే పాల్గొన్నారు. పొలం పనుల కారణంగా రైతులెవరూ పెద్దగా హాజరుకాలేదు.

రేవంత్ సర్కారు అమలుచేస్తున్న రుణమాఫీ ప్రక్రియపై అంతటా అయోమయ పరిస్థితి నెలకొంది. గురువారం ముఖ్యమంత్రి అట్టహాసంగా కార్యక్రమాన్ని ప్రారంభించగా, క్షేత్రస్థాయిలో లబ్ధిదారుల జాబితాపై స్పష్టత లేకపోవడం, కనీసం వాటిని గ్రామ పంచాయతీల్లో ప్రదర్శించకపోవడంతో రైతాంగం గందరగోళానికి గురవుతోంది. అలాగే సహకార సంఘాల్లోనూ అదే పరిస్థితి కనిపించింది. రుణాలను రీ షెడ్యూల్ చేసుకున్న రైతులకూ రుణమాఫీ కాకపోవడంపై రైతులు అవాక్కయ్యారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అప్పటి సీఎం కేసీఆర్ ఏ నిబంధనలు పెట్టకుండా రుణాలను మాఫీ చేసి ప్రతి ఒక్క రైతుకు న్యాయం చేశారని, ప్రస్తుతం రుణాలు మాఫీ అవుతాయని భావిస్తే చివరికి అప్పులు సొంతంగా చెల్లించే పరిస్థితి వస్తున్నదని ఆవేదన వ్యక్తంచేశారు.

- వరంగల్, జూలై 18 (నమస్తే తెలంగాణ ప్రతినిధి)

రీషెడ్యూల్ చేసుకున్న రైతులకూ మొండిచెయ్యి

నర్సంపేట, జూలై 18 : వరంగల్ జిల్లాలో కమర్షియల్ బ్యాంక్‌ల ఆధీనంలో పనిచేస్తున్న సొసైటీల్లో చెన్నారావుపేట, ఊకల్, దుగ్గొండి, మందపల్లి సొసైటీలకు ఇప్పటివరకు రుణమాఫీ వర్తించలేదు. వీటిలో 15వేల మందికి పైగా రూ.2లక్షలకు పైగా రుణం తీసుకున్న వారున్నారు. వారిలో ఇప్పుడు మొదట లక్ష రూపాయలు తీసుకున్న వారు 12వేల మంది ఉన్నారు. కానీ, గురువారం మొదటి జాబితాలో మాఫీ అయిన రైతుల పేర్లు లేవు. ఈ బ్యాంకుల అప్పుల జాబితాలను పరిశీలించేందుకు గత వారం రోజుల నుంచి స్పెషల్ అధికారులు తనిఖీలు చేస్తున్నారు.అయినా ఇప్పటివరకు ఈ తనిఖీలు పూర్తి చేయలేదు. వెరిఫికేషన్ పేరుతో రుణాల మాఫీ ప్రక్రియపై నీలినీడలు అలుముకున్నాయి. ఒక్క చెన్నారావుపేట సొసైటీ నర్సంపేట, చెన్నారావుపేట, నెక్కొండ, గూడూరు మండలాల పరిధిలోని 20 గ్రామాల్లో ఉంది. దీనిలో రెండు లక్షల అప్పులు మాఫీకి అర్హులైన రైతులు 5,768 మంది ఉన్నారు. లక్ష రూపాయల లోపు 4,200 మంది ఉన్నారు. కానీ ఈ సొసైటీలో వెరిఫికేషన్ లంకెతో ఒక్క రైతుకు కూడా మాఫీ జరుగలేదు. కేవలం డీసీసీ బ్యాంకుల పరిధిలోనే ఈ రుణమాఫీ జరిగింది.

భూపాలపల్లిలో కొందరికే..

- 16,502 మందికి మాఫీ
- జాబితాపై పేరు లేక రైతుల్లో నిరుత్సాహం

జయశంకర్ భూపాలపల్లి, జూలై 18(నమస్తే తెలంగాణ) : జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో అర్హులందరికీ పంట రుణమాఫీ కాలేదు. రూ.లక్ష లోపు రుణం తీసుకున్న రైతులకు మాఫీ జరుగకపోవడంతో మొదటి విడత జాబితా చూసి నిరుత్సాహానికి గురవుతున్నారు. రెండో జాబితాలోనైనా పేరుండకపోతుందా అని ఆశగా ఎదురుచూస్తున్నారు. జిల్లాలో 78,703 మంది రైతులు రూ.888.10 కోట్ల పంట రుణాలు తీసుకోగా రూ.లక్ష లోపు రుణాలు తీసుకున్న వారిలో మొదటి విడతలో 16,502 మందికి మాఫీ అయింది. భూపాలపల్లి మండలంలో 1806, చిట్యాలలో 1835, గణపురంలో 1108, మొగుళ్లపల్లిలో 1717, రేగొండలో 3006, టేకుమట్లలో 1729, కాటారంలో 1473, మహదేవ్‌పూర్‌లో 850, మహాముత్తారంలో 1143, పలిమెలలో 261, మల్హార్‌లో 1574మంది రైతులకు మొదటి విడతలో రూ.లక్ష రుణమాఫీ జరిగింది. అయితే రూ.లక్ష లోపు రుణాలు తీసుకున్నది ఎంతమంది.. ఇంకా ఎంతమందికి రుణాలు మాఫీ కాలేదనే విషయమై బ్లాంకర్లు క్లారిటీ ఇవ్వడం లేదు. ఈ విషయమై జిల్లా కలెక్టర్ రాహుల్‌శర్మ బ్యాంకర్లు, వ్యవసాయ అధికారులతో సమావేశంలో ప్రశ్నించగా బ్యాంకర్ల నుంచి ఎలాంటి సమాధానం రాలేదు. కాగా రెండు రోజుల్లో వివరాలు అందిస్తామని చెప్పారు. ఒక ఇంట్లో ఇద్దరు లక్ష లోపు పంట రుణం తీసుకుంటే ఒక్కరికి కూడా రుణమాఫీ జరుగకపోవడంతో ఆందోళనకు గురవుతున్నారు. బ్యాంకులకు వెళ్లేందుకు సిద్ధమవుతున్నారు.

110మందిలో 15మందే అర్హులా..?

మహబూబాబాద్, జూలై 18(నమస్తే తెలంగాణ) : మహబూబాబాద్ జిల్లాలో వ్యవసాయ శాఖ అధికారులు విడుదల చేసిన రుణమాఫీ జాబితాను చాలా మంది రైతుల పేర్లు లేకపోవడంతో వారు ఆందోళనకు గురయ్యారు. రుణమాఫీ చేస్తుందని కాంగ్రెస్ ప్రభుత్వానికి ఓటు వేస్తే.. జాబితాలో పేరులేకుండా పోయిందని ఆవేదనకు గురయ్యారు. జిల్లాలో 27,249 మంది రైతులకు రూ. 159.65 కోట్లు మాఫీ చేస్తున్నట్లు ప్రభుత్వం నుంచి అధికారులకు జాబితా అందింది. మహబూబాబాద్ మండలం బేతోలు గ్రామంలో సుమారు 200మంది రైతులు రుణాలు తీసుకోగా ఇందులో లక్ష రుణం తీసుకున్న రైతుల సంఖ్య 110మంది వరకు ఉంటుందని అంచనా. అయితే ఇందులో 15 మందికి మాత్రమే రుణమాఫీ అయినట్లు జాబితా విడుదల చేయడం రైతులను గందరగోళానికి గురిచేసింది. ప్రభుత్వం విధించిన నిబంధనల వల్ల తాము రుణమాఫీ కోల్పోయామని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఒకే ఇంట్లో తండ్రీకొడుకులు ఉంటే ఒకరిది రుణమాఫీ కాలేదు. మరొకరిది బంగారు రుణాన్ని మాఫీ చేయలేదు. ఇలా ఏదో ఒక కొర్రీలు పెడుతూ అర్హులైన రైతులకు రుణమాఫీ చేయలేదని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం తమను గుర్తించి రుణమాఫీ చేయాలని వేడుకుంటున్నారు.

ములుగులో 12,906మంది

ములుగు, జూలై 18(నమస్తే తెలంగాణ) : ములుగు జిల్లాలో 12906 మంది రైతులకు రూ.లక్ష వరకు రుణమాఫీ చేసినట్లు జిల్లా వ్యవసాయ శాఖ అధికారి విజయ్‌చంద్ర తెలిపారు. ఏటూరునాగారం మండలంలో 966, గోవిందరావుపేటలో 1086, కన్నాయిగూడెంలో 1045, మంగపేటలో 1709, వెంకటాపూర్‌లో 2001, వాజేడులో 1058, వెంకటాపురం(నూగూరు)లో 1389మందికి రుణమాఫీ చేయగా ములుగు మండలంలో అత్యధికంగా 2729 మందికి, అత్యల్పంగా సమ్మక్క-సారలమ్మ తాడ్వాయి మండలంలో 923మందికి మొదటి విడుతలో రుణమాఫీ చేసినట్లు డీఏఓ తెలిపారు. రైతులు తమ అనుమానాలను నివృత్తి చేసుకునేందుకు అన్ని మండలకేంద్రాల్లో గ్రీవెన్‌సెల్‌లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

మోదం.. ఖేదం

హనుమకొండలో 26,369 మందికి లబ్ధి

హనుమకొండ సబర్బన్, జూలై 18 : లక్షలోపు ఉన్న రుణం మాఫీ అవుతుందని ప్రభుత్వం ప్రకటించినా హనుమకొండ జిల్లాలో అందరికీ అందలేదు. అయితే వ్యవసాయ శాఖ అధికారులు రుణ మాఫీ అయిన రైతుల జాబితాను గోప్యంగా ఉంచడం అనుమానాలకు తావిస్తున్నది. ఆయా బ్యాంకర్లకు గానీ, గ్రామాలకు గానీ రుణమాఫీ అయిన రైతుల వివరాలు పంపలేదు. హనుమకొండ జిల్లాలో 26,369 మంది రైతులకు ప్రయోజనం కలిగిందని ప్రభుత్వ ప్రకటన రాగా, అందులో 25,161 కుటుంబాలు లబ్ధి పొందాయని తెలిపారు. కాగా ఈ మొదటి విడుత రుణమాఫీ సందర్భంగా రూ.145 కోట్లు నగదు రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ అయింది. దీంతో రెండో విడత రుణమాఫీ ఎప్పుడు ఉంటుందోనని రైతులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

త్వరలో బాధితురాలికి రైతు బీమా డబ్బులు

బాసటగా నిలిచిన 'నమస్తే తెలంగాణ'

స్టేషన్ ఘన్‌పూర్, జూలై 18: భర్త చనిపోగా వచ్చిన రైతు బీమా డబ్బులను కొందరు పక్కదారి పట్టించగా అధికారుల చర్యలతో త్వరలో వాటిని బాధితురాలికి అందించనున్నారు. స్టేషన్‌ఘన్‌పూర్ మండలం మీదికొండ గ్రామానికి చెందిన రైతు జోగు బాల కొమురయ్య మార్చి 21న అనారోగ్యంతో మృతి చెందగా, అతని భార్య లావణ్య బ్యాంకు ఖాతాలో ప్రభుత్వం రైతుబీమా కింద రూ. 5 లక్షలు జమ చేసింది. అదే గ్రామానికి చెందిన జోగు కుమార్, జోగు సమ్మయ్య ఆ డబ్బులను తమ ఖాతాల్లోకి ట్రాన్స్‌ఫర్ చేయించుకున్నారు. దీంతో లావణ్య ఈ నెల 13న పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, 'రైతు బీమా దళారుల పాలు' అనే శీర్షికతో ఈ నెల 14న నమస్తే తెలంగాణలో ప్రచురితమైంది. స్పందించిన పోలీసులు, జిల్లా అధికారులు సదరు వ్యక్తులపై పోలీసులు చీటింగ్ కేసు నమోదు చేయగా, లెక్కల్లో తేడా చూపించిన రూ. రెండు లక్షలను బుధవారం పోలీసులకు అప్పగించారు. ఆ డబ్బులను బాధితురాలు కోర్టు ద్వారా తీసుకోవాల్సి ఉంటుందని ఎస్సై నాగరాజు తెలిపారు.

రైతుబీమా డబ్బులు ఇప్పించాలంటూ పోలీసులకు ఫిర్యాదు చేసిన మృతుడి భార్య, కూతురు

సౌండ్ చేస్తే అంతే..!

- భారీ శబ్దం వచ్చే బుల్లెట్ సైలెన్సర్లపై కొరడా
- ఎంజీఎం సెంటర్‌లో ధ్వంసం చేసిన ట్రాఫిక్ పోలీసులు

మట్టెవాడ, జూలై 18 : భారీ శబ్దం చేస్తూ బుల్లెట్ బండికి మాడిఫైడ్ సైలెన్సర్ తగిలించుకొని రయ్‌మని దూసుకెళ్లే ఆకతాయిలకు ట్రాఫిక్ పోలీసులు షాక్ ఇచ్చారు. ఇప్పటికే పలుమార్లు తనిఖీలు చేసి పట్టుకున్నా వారిలో మార్పు రాకపోవడంతో సైలెన్సర్లపై కొరడా ఝుళిపించారు. వరంగల్ సీపీ అంబర్‌కిశోర్ ఝా ఆదేశాల మేరకు గురువారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఎంజీఎం కూడలిలో ఉదయం నుంచి ట్రాఫిక్ ఏసీపీ సత్యనారాయణ సూచనల మేరకు ఇన్‌స్పెక్టర్లు, ఎస్సైలు, సిబ్బంది తనిఖీలు చేసి భారీ శబ్దంతో వెళ్తున్న బుల్లెట్ వాహనాలను పట్టుకున్నారు. మొత్తం 155 మాడిఫైడ్ సైలెన్సర్లను తొలగించి రోడ్డు రోలర్‌తో తొక్కించి ధ్వంసం చేశారు. గత ఏప్రిల్‌లో 255 వాహనాల సైలెన్సర్లు ధ్వంసం చేశామని ఇకనుంచి రాత్రివేళల్లో కూడా తనిఖీలు చేసేందుకు ఎస్సై, మరో ఐదుగురు సిబ్బందిని ఏర్పాటుచేసినట్లు ఏసీపీ సత్యనారాయణ తెలిపారు. ఎవరైనా భారీ శబ్దం వచ్చే సైలెన్సర్లను అమర్చుకుంటే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో హనుమకొండ ట్రాఫిక్ సీఐ శుక్రు, కాజీపేట సీఐ నాగరాజు, ట్రాఫిక్ ఎస్సైలు, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

సైలెన్సర్లను ధ్వంసం చేస్తున్న రోడ్డురోలర్ వాహనం

గడి చెరువు జలపాతం వద్ద పర్యాటకుల సందడి

చూడముచ్చటైన గడి

వెంకటాపురం (నూగూరు), జూలై 18 : మహితాపురం గ్రామ సమీపంలోని గడి చెరువు జలపాతం పర్యాటకులను ఆకర్షిస్తున్నది. ప్రకృతి ఒడిలో ఉన్న జలపాతం జలకళను సంతరించుకోవడంతో గురువారం హైదరాబాద్, కరీంనగర్, వరంగల్, ఖమ్మం, నల్లగొండతో పాటు భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల నుంచి పెద్ద సంఖ్యలో పర్యాటకులు తరలివచ్చారు. గుట్టలపై నుంచి నీరు జాలువారుతుండడాన్ని చూసి పర్యాటకులు మంత్రముగ్ధులయ్యారు. జలపాతం నీటిలో జలకాలాడుతూ సరదాగా గడిపారు.

కటాఫ్ తేదీ సరైంది కాదు..

ములుగు కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న సీపీఐ నాయకులు

- రైతులందరికీ రుణమాఫీ చేయాలి
- సీపీఐ జిల్లా కార్యదర్శి మల్లికార్జున్‌రావు
- ములుగు కలెక్టరేట్ ఎదుట ధర్నా

ములుగు రూరల్, జూలై 18 : కాంగ్రెస్ ప్రభుత్వం రుణమాఫీ విషయంలో కటాఫ్ తేదీ నిర్ణయించడం సరైంది కాదని, రుణమాఫీని రైతులందరికీ వర్తింపజేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి తోట మల్లికార్జున్‌రావు అన్నారు. గత ప్రభుత్వంలో మిగిలిన రుణాలను కూడా మాఫీ చేస్తామని కాంగ్రెస్ నాయకులు ఎన్నికల మ్యానిఫెస్టోలో పేర్కొన్నారని గుర్తుచేశారు. గురువారం పార్టీ ఆధ్వర్యంలో ములుగు కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టి మాట్లాడారు. గతంలో రుణమాఫీ తర్వాత మిగిలిన రుణాలన్నింటిని కూడా ప్రస్తుతం మాఫీ చేయాలని, రీషెడ్యూల్ రుణాలకు కూడా వర్తింజేయాలని డిమాండ్ చేశారు. పహాణి నకల్ ద్వారా పొందిన రుణాలను కూడా మాఫీ చేసి భూ సమస్యలను పరిష్కరించాలన్నారు. ఆసరా పింఛన్లను పెంచుతామన్న హామీని నెరవేర్చాలని కోరారు. పేదలకు గృహ నిర్మాణాల కోసం ప్రభుత్వం ద్వారా ఆర్థిక సాయం అందించాలని, నిరుద్యోగ సమస్యలను పరిష్కరించాలని, మ్యానిఫెస్టోలోని హామీలను అమలు చేయాలని అన్నారు. ధర్నాలో జిల్లా సహాయ కార్యదర్శి జంపాల రవీందర్, నాయకులు ఐలయ్య, ఇంజం కొమురయ్య, అమ్జద్‌పాషా, నర్సయ్య, శ్రీనివాస్, గణేశ్, శ్యాంసుందర్, రమేశ్, నటరాజ్, లక్ష్మి, సదయ్య, రాజన్న, పరమ్‌సింగ్, సమ్మయ్య పాల్గొన్నారు.



జయ ఇనిస్టిట్యూట్‌లో డీఎస్సీ పరీక్ష రాసేందుకు వెళ్తున్న అభ్యర్థులు

డీఎస్సీ పరీక్షలు షురూ

తొలిరోజు ఉదయం 1,038, మధ్యాహ్నం 123 మంది హాజరు

హనుమకొండ చౌరస్తా, జూలై 18 : ఉపాధ్యాయుల భర్తీ కోసం నిర్వహించే డీఎస్సీ-2024 పరీక్షలు గురువారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. హనుమకొండ నగరంలోని ఐదు పరీక్షా కేంద్రాల్లో ఉదయం 9 నుంచి 11.30 గంటల వరకు నిర్వహించిన పరీక్షకు 1,206 మందికి 1,038 మంది అభ్యర్థులు హాజరు కాగా, 168 మంది గైర్హాజరయ్యారు. రెండో విడత మధ్యాహ్నం 2 నుంచి 4.30 గంటల వరకు జరిగిన హసన్‌పర్తి ఎర్రగట్టు గుట్ట సమీపంలోని అయాన్ డిజిటల్ జోన్ పరీక్ష కేంద్రంలో నిర్వహించిన పరీక్షకు 138 మందికి 123 మంది అభ్యర్థులు హాజరయ్యారు. 15 మంది గైర్హాజరైనట్లు అధికారులు తెలిపారు. పరీక్ష కేంద్రాలను జిల్లా విద్యాశాఖాధికారి, డీఎస్సీ పరీక్షల పర్యవేక్షణాధికారి డీ వాసంతి సందర్శించారు. ఎక్కడా ఎలాంటి ఇబ్బందులు లేకుండా పరీక్షలు ప్రశాంతంగా జరిగినట్లు తెలిపారు. కాగా, పరీక్షా కేంద్రాల వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.